# కళాభినివేశం

వస్తా ఆఫీసులో పనేం లేకపోతే రోడ్డుకేసి చూస్తుంటాం. మాకు ఎదురుగా రోడ్డు వుంది. ఆ రోడ్డు వెంబడే వెళుతున్న మనుష్యుల్ని చూస్తుంటాము. అలా చూట్టంలో మాకు రకరకాల అభిరుచులున్నాయి.

మా 'కొలీగ్' ప్రసాద్‌కు ఏ రకం రంగు చీరలు ఆ బాట వెంట వెళుతున్నా సిక్త్స్‌సెన్స్ పని చేస్తుంది. వెంటనే అటువైపు తిరగటం, ఆనందించటం అతని అలవాటు.

ఆ రోడ్డు ప్రక్కన చెట్టొకటుంది. దాని మీదకు కొండముచ్చుల గుంపొకటి వస్తుంటుంది. ఆ చుట్టుప్రక్కలే ఓ కాన్వెంట్ వుంది. దాంట్లో పిల్లలకు ఇవొచ్చినప్పుడు భలే సరదా. అవి కూడా రకరకాల ప్రయోగాలు చేస్తుంటాయి. చెట్ల నుండి చెట్లకు, కొమ్మల నుండి కొమ్మలకు అవి ఎగురుతూ వుంటే నేనూ చూసి ఆనందిస్తుంటాను.

ఆ రోజు కూడా మామూలుగా చూస్తుంటే ఆ చెట్టు క్రింద ఒకతను ఏవేవో బొమ్మలు పేరుస్తున్నట్లనిపించింది. మా అటెండర్ను పిలిచి అతగాడిని పిలుచుకు రమ్మని చెప్పాం.

ఆ రోజు అయిదో తారీఖు. అంటే జీతాలొచ్చి మాకు మూడు రోజులే అవుతుంట. అందుకే మాలోని కళాభిరుచి ఎగతన్నింది. మరి

ముళ్ళపూడి గారన్నట్లు "మడి సన్నాక కాసింత కలాపోసన" చెయ్యాలి కదా!

అతగా డొచ్చాడు. రెండు నెమళ్ళు, ఒకదాని కెదురుగా ఒక టున్నాయ్. వాటిని గొడ్డు కొమ్ముతో చేస్తారట. టేబుల్ మీద పెట్టుకుంటే బాగుంటాయ్. నేను చాలమంది ఇళ్ళలో చూశాను. వాటిని కొనాలని చాలా కాలంగా అనుకుంటున్నాను. అప్పుడప్పుడు ఎవరితోనన్నా "లేపాక్షి ఎంపో రియమ్"కు వెళ్ళినప్పుడల్లా ఈ కోరిక మరింతగా బలపడుతుంది.

అతగాడు బొమ్మల్ని టేబుల్ మీద పెట్టేడు. బొమ్మలు బాగానే వున్నాయ్. ఒక్కో బొమ్మ ముప్పై అయిదు రూపాయలు చెప్పాడు. గొడ్డు కొమ్ము మార్కెట్‌లో ఇరవై రూపాయలట. అది కొన్నాక మాడిపోయిన ట్యూబ్‌లైటు పెంకుల్తో గీకితేగాని ఆ నునుపుదనం రాదట. ఆ తర్వాత రెండు రోజులకుగాని బొమ్మ తయారు కాదట. మాకు కూలి తప్పితే ఏం మిగలదని చెప్పేడు. అందులో కొంత వరకు నిజం వుండొచ్చు. అయినా రేటు చూస్తుంటే నాకు కొంచెం ఎక్కువ అనిపించింది.

చాలా మంది భలే బేరాలు చేస్తారు. నా కయితే బేరం చెయ్యా లనుంది కానీ....అతనిలోని కళాత్మకతకు రేటు కట్టడం ఏమిటి అనిపించింది. నన్ను బొత్తిగా కళాభిరుచి లేనివాడిగా జమకడతాడేమోననే బాధ సైతం వుంది.

"నువ్వే చెప్పు మరో మాట" అన్నాను.

"సరే, రెండు రూపాయలు తగ్గించుకోండి" అన్నాడతను.

అయినా సంతృప్తి కలగలేదు.

అయితే మరో కొలీగ్ మోహన్‌తో ఈ ఇబ్బంది తొలగిపోయింది. ఒక్కొక్కటి ఇరవై రూపాయల కిమ్మని బేరమాడాడు. ఆ బొమ్మలతను అంత దారుణమా అన్నాడు. ముప్పై ఇవ్వమన్నాడు. ఇరవై ఎనిమిది.... అయిదు....మూడు.... రెండు.... ఇరవైకి దిగొచ్చాడు. "నాకు అర్జెంటుగా

డబ్బు అవసరం. అందుకే ఇస్తున్నా" నంటూ వాటిని టేబుల్ మీద పెట్టేడు. అవి ఒక సెట్టే వున్నాయి. వాటిని ప్రసాద్ తీసుకుంటానన్నాడు.

"ఇంకేం లేవా" అన్నాం. అప్పుడు తీశాడు. ఈసారి నెమళ్ళు కాదు కొంగలు.

ఓ పెద్ద కొంగ....మరో పిల్ల కొంగ. ఒకదాని కొకటి ఎదురుగా వున్నాయ్. జేబులో నుండి ఏదో తీసి కొంగ నోట్లో పెట్టాడు. అది చేప పిల్ల. పెద్ద కొంగ నోట్లో చేప పిల్ల దాని వంకే చూస్తూ కొంగపిల్ల.... దృశ్యం బాగుంది.

అది కూడా ఇరవై కే మాట్లాడుకొన్నాక ఆ సెట్టు నేను తీసుకొన్నాను. మరో సెట్టు ఇంకో మిత్రుడు తీసుకున్నాడు. మొత్తం మీద ఆ రోజు మా ఆఫీసులో ఓ వంద సైచిలుకు ఖర్చుచేసి కళాపోషణ చేశాం.

ఆ బొమ్మను తెచ్చి ఇంటిలో ఎక్కడ పెట్టాలా అని ఆలోచించాను. ఆఖరుకు మా డైనింగ్ టేబుల్ మీద పెట్టాలని నిర్ణయించుకొన్నాను. అక్కడుంటేనే అది కన పడుతుంది. మా ఇంటికి షో కేసులు లేవు.

## 2

రోజూ మా యింట్లో మేమందరం కలిసే భోంచేస్తాం.

మేమందరం అంటే మా కిద్దరు పిల్లలు. ఇద్దరూ మొగ పిల్లలే. నా ఆవిడతో కలిసి నలుగురం. రోజూ కబుర్లు చెప్పుకుంటూ భోంచేయటం మా కలవాటు.

"నాన్నగారూ. కొంగ చేపని తింటుందా?" అనడిగేడు మా చిన్ని ఓ రోజు.

"అవునురా" అన్నాను వాడి కళాభిరుచికి మురిసిపోతూ. నేను తెచ్చిందగ్గర్నుండీ వాడా బొమ్మను గమనిస్తున్నాడు. క్రొత్తలో బొమ్మవంక

చూస్తున్నాడనుకున్నా, వాడలా చూస్తుంటే ఏదో రోజు ఇలాంటి ప్రశ్న వస్తుందని తెలుసు.

"అంటే ఇవ్వాళ కొంగది చేపల కూర" అన్నాడు. తిరిగి వాడి జోక్ నవ్వు తెప్పించింది. అంతలోనే ఏదో గుర్తు కొచ్చింది మేం చేపలు వండుకుని చాలాకాల మయింది. ఆ సంగతి కాని చెప్పడం వాడు లేదు కదా అనిపించింది. మరుసటి రోజు మార్కెట్టు కెళ్ళి ఓ పెద్ద చేప తెచ్చి వండించే శాను. తిరిగి అందరం భోజనం దగ్గర కూర్చున్నాం.

"ఈరోజు కొంగదేకాదు. మనదీ చేపలకూరే" అన్నాను.

నా కెందుకో వాడి మనస్సులోని విషయం కనుక్కో గలిగాననే సంతృప్తి వుంది. ఆ వుత్సాహంతోనే అన్నాను.

"నాన్నగారూ....మరి ఆ కొంగకు రోజూ చేపల కూరేనా?" అనడిగాడు. వాడి నుండి కాంప్లిమెంట్ కోసం ఎదురు చూస్తున్న నాకీ ప్రశ్న తికమక కలిగించింది.

"కొంగలాహారం అదే" అన్నాను.

నా కెందుకో వాడ్ని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. వీడి మాటల్లో లాజిక్ వుంది. వీడు హేతువాది కాడు కదా! ఏమో ఎవరు చూడొచ్చారు?

"మనమే నయం....ఎంచక్కా చేపలూ, మాంసం.... కూరగాయలు అన్నీ తినొచ్చు" అంటూ వాడే అన్నాడు తిరిగి.

"కొంత మంది కొంగల్ని కూడా తింటారు" అన్నాడు మా పెద్దవాడు.

'ధన్' మంటూ చప్పుడయింది. కొంగ బొమ్మ పడి పోయింది. నా శ్రీమతి నవ్వుతోంది—మా పెద్దాడి మాటకు నవ్వొచ్చి. ఆమె చేతిలోని గరిటె జారి, కొంగమీద పడింది. తిరిగి కొంగను నిలబెట్టాను. చేప కూడా పడి పోయింది అది తీసి తిరిగి కొంగ నోట్లో పెట్టాను.

మా చిన్ని ఎందుకో ముఖం చిట్లించుకున్నాడు. అదా క్షణం అర్థం కాలేదు. కొంగను తింటారనే ఆలోచన వాడికి నచ్చలేదేమో అనుకున్నాను. మా పెద్దవాడు మితభాషి. అయినా ఇలాంటి పిడుగులు వేస్తుంటాడు. మొత్తం మీద చేపల కూర రుచిగా వున్నా నాకంత సంతృప్తి ఇవ్వలేక పోయింది.

ఆ తర్వాత మా చిన్ని ఆ బొమ్మ వంక చాలాసార్లు సీరియస్‌గా చూడటం గమనించాను. అలా చూస్తున్నా డంటే మరలా ఏం ప్రశ్నిస్తాడో ననేది నా భయం. అయితే వాడు నన్ను ప్రశ్నించటం మానేశాడు.

వాడు ఏ కోణంలో నుండి ఆ బొమ్మ అందాన్ని చూస్తున్నాడో! నిజానికి అలాంటి బొమ్మను కొన్నందుకు నేను గర్వపడ్డాను. గేదె కొమ్ముల్ని సైతం అలా మలిచిన ఆ కళాకారుడి కృషికి అభినందించాను. ఏడేళ్ళ పిల్లవాడిలో ఇంత కళాభినివేశాన్ని కలిగించటంసామాన్య విషయం కాదు.

రాను....రానూ నాకు ఆ బొమ్మ వంక చూసుకోవటం అలవా టయింది. మాదీ ఒకే పెద్ద గది. అందులోనే బెడ్ రూమ్, డైనింగ్ రూమ్....అన్నీనూ. నేను లేవగానే ఎదురుగానే కొంగ బొమ్మ దర్శన మిస్తుంది. అదే కొంగ దాని నోట్లో చేపపిల్ల, చూస్తూ కొంగపిల్ల.

ఆ బొమ్మను చూస్తుంటే ఎందుకో దానికీ, నాకూ పోలిక వుందని పించింది. నా రొటీన్ జీవితం గుర్తుకొస్తుంది. ఆ బొమ్మను గేదె కొమ్ముతో మలిచి అలా నిలబెట్టారు. మరి నేనో....బాధ్యతలతో మలచబడి రాజీ పడుతూ బ్రతుకుతున్నాను. అందుకే నాకూ ఆ బొమ్మకూ తేడాలేదు. ఇప్పుడు ఆ బొమ్మ నా స్నేహితుడు. లేవగానే.... కాఫీత్రాగుతూ.... భోంచేస్తూ....నిద్రపోయే ముందు అలా చూస్తూ వుండేవాడిని.

"నాన్నగారూ ఆ చేపపిల్లను తినటం

ఈ శతాబ్దంలో పూర్తవుతుందా" అని మా చిన్ని ఎన్నడో ఒక నాడు అడుగుతాడేమోనని నా అనుమానం.

మామూలుగా ఆ రోజు కళ్ళు తెరిచి కొంగపై ఒక సారి చూసి కళ్ళు మూసుకున్నాను. ఎందుకో ఆ బొమ్మలో లోపం కనిపించింది. గబుక్కున లేచి ఆ బొమ్మ దగ్గరకు వెళ్ళాను. ఇప్పుడు ఆ చేపపిల్ల కొంగ నోట్లో లేదు. కొంగ పిల్ల నోట్లో వుంది. కొంగ దిగ్భ్రాంతితో చూస్తోంది. అప్పుడే లోపలకు వచ్చిన చిన్ని నవ్వుతున్నాడు.

ఆ బొమ్మలో పెద్ద మార్పేం లేదు. ఆ మార్పు చాలా స్వల్పమే అయినా ఎంతో ప్రగాఢంగా వుందనిపించింది. అది నా రొటీన్ ఆలోచనల మీద దెబ్బ తీసింది. ఎందుకో చిన్ని ఆ క్షణం నాకు దారిచూపే ప్రవక్తలా కనిపించాడు. నా స్తబ్దమైన ఆలోచనల్ని షాక్ట్రీట్మెంట్‌తో మేల్కొల్పాడు. ఇప్పుడు బొమ్మ నాకు రొటీన్ జీవితంలా అనిపించటం లేదు. భవిష్యత్తుకు సంకేతంలా కన్పించింది.

చిన్ని ఏ వుద్దేశంతో ఆ పని చేసినా
అది నన్ను మేల్కొల్పింది.
అంత గొప్ప అత్యల్ప విషయం అది!

—అపరాధ పరిశోధన